విభిన్న రుచుల మధ్య సమైక్యత సాధించడమే
'విశ్వావసు' శుభవచస్సు!

సృష్టిలో మన అనుభవంలో వున్న అత్యద్భుతమైన అంశం కాలం. అది పదార్థం కాదు. కాలానికి రూపరస గంధాది విశేషాలు లేవు. అయినా అది మన అనుభవానికి అందుతూ ఉంది. దానితోనే మన ఆయుష్షు ముడిపడి ఉంది. ఇలాంటి ఈ కాలగతికి హేతువు మన అంతరిక్షంలోని సౌర వ్యవస్థ. సూర్యుడు, చంద్రుడు, భూమి ఇత్యాది గ్రహాల సంచారం వల్ల రాత్రింబవళ్ళు ఏర్పడుతుంటే మానవుడు తన మేధాశక్తిని ఉపయోగించి వాటిని రోజులుగా, వారాలుగా, పక్షాలుగా, నెలలుగా, సంవత్సరాలుగా, దశాబ్ది, శతాబ్ది, సహస్రాబ్దాలుగా, యుగాలుగా పరిగణిస్తూ కాలక్రమాన్ననుసరించి చరిత్రని నమోదు చేస్తున్నాడు. ఈ క్రమంలో పన్నెండు నెలల కాలాన్ని సంవత్సరంగా గుర్తిస్తూ ఆ కాల ఖండ ప్రారంభాన్ని - అంటే ఏడాదిని - ఆహ్వానించడానికి జరిపే పండుగే యుగాది! అదే మన నిత్య వ్యవహారంలో ఉగాది!

ఈ సంవత్సర కాలంలో ఆరు ఋతువులు! అంటే ఒక్కో ఋతువు రెండేసి నెలలు! ఆ ఋతువుల్లో రాజు - శ్రీశ్రీ మాటల్లో చెబితే ఋతువుల రాణి - వసంతం! చైత్రమాసం శుక్ల పక్షం మొదటిరోజు - పాడ్యమితో ఆ వసంతం ప్రారంభం! దాంతో మనకి కొత్త సంవత్సరం ఆరంభం!

ఈ కాలాన్ని సంవత్సరాలుగా గుర్తించడంలో మన ప్రాచీన జ్యోతిష శాస్త్రవేత్తలు అరవై పేర్లని కల్పించారు. అవే ప్రభవ, విభవ అంటూ మొదలై అక్షయ దాకా సాగుతాయి. అంటే కాలం అరవై ఆకుల చక్రం. ఇప్పుడు ఆ చక్రంలో క్రోధిని వెనక్కు నెట్టి విశ్వావసు వచ్చింది. అది వస్తూవస్తూ - కొత్త విశ్వాసంతో పాటు - వసంతాన్నీ తనవెంట తీసుకొచ్చింది. తత్ఫలితమే తరు, లతాదుల్లో ఎర్రని ఈ చివుళ్ళు, పచ్చని ఆకులు, పూలు, పిందెలు! కొమ్మ ఊయలల మీద కోయిలలు! తియ్యగా వినిపించే కోకిల పాటలు! చిలుక పలుకులు! చెరకు రసాలు! నోరూరించే చింత పులుసులు! తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు- వెరసి అన్నీ కలిసి ఉగాది పచ్చడి! అది సంకేతం మన జీవితానికి! ఈ విభిన్న రుచుల మధ్య ఒక సమైక్యతని సాధించాలనడమే ఈ 'విశ్వావసు' శుభవచస్సు!

- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి





తాళ్లూరి రుక్మిణీదేవికి ఉగాది పురస్కారం ప్రదానం చేస్తున్న ఇందిరాదత్

ప్రపంచ తెలుగు సమాఖ్యలో
ఉగాది సంబరాలు

- తాళ్లూరి రుక్మిణిదేవికి పురస్కార ప్రదానం

ప్యారీస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ గాంధీనగర్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం 11 గంటలకు ఫణీంద్రశర్మ పంచాంగ శ్రవణం, అరుణా శ్రీనాథ్ ప్రార్థన గీతంతో ప్రారంభమైన ఈ వేడుకల్లో సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ స్వాగతోపన్యాసం చేసి అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమాఖ్య సంయుక్త కోశాధికారి, చెన్నై మాస్టర్స్ అథ్లెటిక్ కార్యదర్శి తాళ్లూరి రుక్మిణిదేవి సేవలను కొనియాడుతూ ఆమెకు ప్రేక్షకుల కరతాళాల మధ్య ఉగాది పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇందిరాదత్ మాట్లాడుతూ.. రుక్మిణిదేవి బాల్యం నుంచే చదువు, ఆటలపై శ్రద్ధచూపారని, వ్యాయామ, యోగాతో శారీరక మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని నిరూపించారని కొనియాడారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందిన అనంతరం క్రీడలపై దృష్టి సారించారన్నారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు బెంగళూరులో జరిగిన 45వ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె పోల్ వాల్ట్‌లో స్వర్ణం, హామర్ త్రోలో రజతం, హైజంప్‌లో కాంస్య పతకాలను గెలుచుకున్నారన్నారు. ఇంతటి ఘనత సాధించిన ఆమెను సమాఖ్య తరఫున సత్కరించుకోవడం సంతోషం కలిగించిందన్నారు. ఈ వేడుకల్లో ప్రముఖ సినీ దర్శకుడు సీఎస్ రావు శతజయంతిని పురస్కరించుకుని ఆయన దర్శకత్వం వహించిన తెలుగు సినిమాలలో ప్రజాదరణ పొందిన పాటలు, ఆయన జీవితచరిత్రపై ఆయన కుమార్తె దేవీకృష్ణ ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. పి.గిరిజారెడ్డి, జయశ్రీ తాతినేని, గోటేటి వెంకటేశ్వరరావు, లలిత సుధాకర్, ఇందిరాకుమారి, నగేష్, ఎ.రాజ్యలక్ష్మి, జేఎం నాయుడు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం సమాఖ్య ప్రధాన కార్యదర్శి కె.శ్రీలక్ష్మి మోహన్‌రావు వందన సమర్పణతో ముగిసింది.



హాజరైన సమాఖ్య సభ్యులు

ముఖ్యమంత్రిగా స్టాలిన్‌కే
ప్రజల పట్టం

- రెండు, మూడు స్థానాల్లో విజయ్, ఈపీఎస్







చెన్నై, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎంగా తదుపరి ఎవరు ఉండాలనే విషయమై ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన సర్వేలో సీఎం ఎంకే స్టాలిన్‌కే అగ్రతాంబూలం లభించింది. స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ 27 శాతం మంది అభిప్రాయపడగా, విజయ్, ఈపీఎస్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో, అన్ని రాజకీయ పార్టీలు తమ వ్యూహాలతో ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. డీఎంకే నేతృత్వంలో బలమైన కూటమి రాబోయే ఎన్నికల్లోనూ కొనసాగే అవకాశాలు మెండుగా ఉండడంతో, అన్నాడీఎంకే - బీజేపీ కలసి కొత్త కూటమి ఏర్పాటుచేసే పనిలో బిజీగా ఉన్నాయి. సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళర్ కట్చి ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ఇదివరకే ప్రకటించింది. నటుడు విజయ్ ప్రారంభించిన టీవీకే తొలిసారిగా 2026లో జరుగనున్న ఎన్నికల్లో పోటీ చేయనుంది. రానున్న ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు పలు సంస్థలు సర్వేలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా సీ ఓటరు సంస్థ తదుపరి ముఖ్యమంత్రిగా ఎవరిని కోరుకుంటున్నారు? అనే విషయమై రాష్ట్రంలో సర్వే చేపట్టింది. అందులో రాష్ట్రానికి తదుపరి ముఖ్యమంత్రి ఎవరు? రాష్ట్ర ప్రభుత్వ పాలన ఎలా ఉంది? ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యక్తిగత వ్యవహారశైలి ఎలా ఉంది? రాష్ట్ర ప్రధాన సమస్యగా దేన్ని చూస్తున్నారు? మీ నియోజకవర్గ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది? వంటి పలు ప్రశ్నలను సంధించారు. ఆ ప్రకారం, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, తదుపరి ముఖ్యమంత్రిగా ఉండాలని 27 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. అదే సమయంలో, అన్నాడీఎంకే, బీజేపీలను అధిగమించి టీవీకే అధ్యక్షుడు విజయ్ రెండో స్థానంలో నిలిచారు. టీవీకే అధ్యక్షుడు తదుపరి ముఖ్యమంత్రి కావాలని 18 శాతం కోరుకుంటుండగా, అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్‌కు కేవలం 10 శాతం మంది మాత్రమే అండగా నిలిచారు. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవాలని బలమైన వ్యూహాలతో ముందుకు సాగుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదుపరి ముఖ్యమంత్రి కావాలని 9 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ పాలనకు ఆదరణ...

రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు వెలిబుచ్చిన అభిప్రాయాల మేరకు, 15 శాతం మంది పూర్తి సంతృప్తి వ్యక్తం చేయగా, 36 శాతం మంది కొంత ఆశాజనకంగానే ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే, 25 శాతం మంది ప్రభుత్వ పాలన సరిగా లేదనగా, మరో 25 శాతం మంది చెప్పేదేమీ లేదని సమాధానమిచ్చినట్లు సర్వేలో వెల్లడైంది. అలాగే, ముఖ్యమంత్రి వ్యక్తిగత వ్యవహారశైలిపై అడిగిన ప్రశ్నకు 25శాతం మంది సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలపగా, మరో 33 శాతం మంది కొంత ఆశాజనకంగా ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే 22శాతం ముఖ్యమంత్రి పనితీరును తీవ్రంగా వ్యతిరేకించగా, మరో 23 శాతం మంది చెప్పేదేమీ లేదని వ్యాఖ్యానించారు.

ప్రతిపక్షానికి 8 శాతం మాత్రమే మద్దతు...

ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి పనితీరు ఎలా ఉంది? అనే ప్రశ్నకు 8 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, 27 శాతం పర్వాలేదని, 32 శాతం ఈపీఎస్ పనితీరు బాగా లేదని, మరో 33 శాతం మంది ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు అయిష్టత చూపారు.

మహిళల భద్రత ప్రశ్నార్థకం...

రాష్ట్రంలో నెలకొన్న ప్రధాన సమస్యలు ఏమిటి? అన్న ప్రశ్నకు మహిళలకు భద్రత కరువైందని 15 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. 12 శాతం మంది నిత్యావసర వస్తువుల ధర పెరుగుదల అన్నారు. అలాగే, రాష్ట్రంలో మాదకద్రవ్యాల చెలామణి పెరిగిందని 10 శాతం మంది, నిరుద్యోగం ప్రధాన సమస్యగా ఉందని 8 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యేల పనితీరు ఓకే...

రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందని అడిగిన ప్రశ్నకు... నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలు చేస్తున్న కృషి సంతృప్తికరంగా ఉందని 16 శాతం మంది, పర్వాలేదని 32 శాతం మంది అభిప్రాయపడ్డారు. అలాగే, 25 శాతం మంది ఎమ్మెల్యేల తీరు సరిగా లేదని, నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదని వ్యాఖ్యానించగా, 27 శాతం మంది ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు నిరాకరించారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (ఆదివారం సాయంత్రం)

ఆదిద్రావిడుల సంక్షేమానికి
రూ.280 కోట్లు

- సీఎం స్టాలిన్ ప్రకటన





ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడుల సంక్షేమానికి రూ.280 కోట్లు కేటాయించనున్నామని, ఈ నిధుల్లో అధికభాగాన్ని ఆదిద్రావిడులకు అయోధ్య దాస పండితర్ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించిన గృహ సముదాయాల్లో కనీస సదుపాయాలు కల్పించేందుకు ఖర్చు చేయనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. సచివాలయంలో శనివారం ఉదయం ఆదిద్రావిడ, గిరిజన శాఖల ఉన్నతస్థాయి అవగాహన, పర్యవేక్షణ, నిఘా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదిద్రావిడ, గిరిజనశాఖల ఉన్నతస్థాయి అవగాహన, పర్యవేక్షణ, నిఘా కమిటీలో ఆదిద్రావిడ, గిరిజన కులాలకు చెందిన ఏడుగురు పార్లమెంట్ సభ్యులకు సభ్యత్వం కల్పించామని చెప్పారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమ సంస్థ, జైభీం కార్మికులు, చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం, సుగాలీలు, ఇరులర్ తదితర కులస్థులకు వ్యాపారాల కోసం రుణ సదుపాయం కల్పిస్తున్నామని, ఈ కులాలకు చెందిన విద్యార్థుల ఉన్నత చదువులకు కూడా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను చిరు వ్యాపారులుగా మార్చేనిమిత్తం రాయితీతో యంత్ర పరికరాలను అందిస్తున్నామన్నారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్, కార్మిక సంక్షేమ శాఖ మంత్రి సీవీ గణేషన్, ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ మంత్రి ఎం.మదివేందన్, మానవవనరుల శాఖ మంత్రి ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, హోంశాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ శంకర్‌జివాల్, డీపీఐ నాయకుడు తొల్ తిరుమావళవన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వావసు నామ సంవత్సరానికి ఘనస్వాగతం

- అమరజీవి స్మారక భవనంలో 'ఉగాది' సంబరాలు



బహుమతులు అందుకున్న కవులతో కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు


ప్యారీస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదికి ఘనస్వాగతం పలుకుతూ సంబరాలు నిర్వహించింది. శనివారం సాయంత్రం 5 గంటలకు జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన, పంచాంగ పఠనంతో ప్రారంభమై అతిథుల ప్రసంగాలు, కవి సమ్మేళనం, కూడిపూడి నాట్యం తదితర అంశాలతో రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం అలరించింది. కమిటీ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్‌రెడ్డి సభాధ్యక్షుడిగా వ్యవహరించగా, కార్యదర్శి, కోశాధికారి వి.కృష్ణారావు స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా సీనియర్ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ న్యాయ విభాగ అదనపు కార్యదర్శి గుర్రం చినసాగూర్ హాజరై ఉగాది కవితా సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయిత్రులకు ప్రశంసా పత్రం, బహుమతులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. విద్వాన్ డాక్టర్ కాసల నాగభూషణం కవులను అభినందించారు.

స్మారక భవనానికి పూర్వవైభవం వస్తే ఆంధ్రజ్యోతే కారణం : అనిల్‌కుమార్‌రెడ్డి

ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ.. రాజధాని నగరం చెన్నైలో తెలుగువారికంటూ ఏకైక అధికార భవనమైన అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల గురించి ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనం వల్ల ఈ భవనానికి చాలా ఏళ్ల తర్వాత ఉగాది సందర్భంగా పూర్వవైభవం వస్తోందని అన్నారు. ఏపీ ప్రభుత్వం ఈ భవనానికి తాజాగా నిధులు విడుదల చేసిందని, ఇదుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్మారక భవనానికి పూర్వ వైభవం వస్తే అందుకు ఆంధ్రజ్యోతి దినపత్రికే కారణమని వ్యాఖ్యానించారు. సభ్యులు డాక్టర్ ఎంవీ నారాయణ గుప్తా, జేఎం నాయుడు సహా 11 మందికి పైగా తెలుగు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్న సభ నిర్వహణ బాధ్యతలను సభ్యులు డాక్టర్ విస్తాలి శంకరరావు చేపట్టగా, మరో సభ్యురాలు డాక్టర్ ఏవీ శివకుమారి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

గుడిమెట్ల చెన్నయ్యకు ఏపీ ప్రభుత్వ ఉగాది పురస్కారం

- నేడు విజయవాడలో ప్రదానం



చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు తల్లి ముద్దుబిడ్డ, 'జనని' సాంఘిక సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గుడిమెట్ల చెన్నయ్యను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'ఉగాది పురస్కారం' వరించింది. తెలుగుభాషకు, తెలుగు కళలకు ఆయన అందిస్తున్న సేవలకు గుర్తుగా ఆ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. యేటా ఏపీ ప్రభుత్వం వివిధ విభాగాల్లో కృషి చేస్తున్న వారికి ఉగాది పురస్కారాలు ఇస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాదికి గాను చెన్నయ్యకు కూడా పురస్కారం ప్రదానం చేయాలని నిర్ణయించింది. శనివారం విజయవాడలో జరుగనున్న ప్రదానోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు అందించనున్నారు. అదే విధంగా నగదు బహుమతి, జ్ఞాపికను కూడా ప్రదానం చేయనున్నారు.

చిన్నప్పటి నుంచే మాతృభాషపై మమకారం...

1950లో జన్మించిన చెన్నయ్య విద్యాభ్యాసమంతా చెన్నైలోనే గడిచింది. ఆయన ఎంపీయూ స్కూలో 11వ తరగతి, సర్ త్యాగరాయ కళాశాలలో పీయూసీ, బీకాం చేశారు. 1971-72లో తమిళనాడు పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహించిన పరీక్షను తెలుగులోనే రాసిన చెన్నయ్య.. తమిళనాడు డెయిరీ డెవలప్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. అనంతరం 1976లో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీ ద్వారా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో ఉద్యోగం పొందారు. అదే బ్యాంకులో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి 15 ఏళ్ల క్రితం పదవీ విరమణ చేశారు. పరాయిగడ్డపై ఉన్నా తన మాతృభాష అంటే చెన్నయ్యకు ఎనలేని మమకారం. తండ్రి చెప్పిన మాట ప్రకారం చిన్ననాటి నుంచే ప్రతిరోజూ తెలుగు దినపత్రికను చదవడం అలవాటు చేసుకున్న ఆయనకు భాషపై మంచి పట్టు వచ్చింది. చిన్నప్పటి నుంచే నాటకాలన్నా ఆయనకు ఎనలేని ప్రీతి. కళాశాలలోనే ఆయన పలు నాటకాలు ప్రదర్శించి రామలక్ష్మి, ఆరుద్ర, రంగనాథ్, పద్మనాభం వంటి వారి చేత శెభాష్ అనిపించుకున్నారు. నగరంలో క్షీణించిపోతున్న తెలుగును ఆదుకునేందుకు మూడు దశాబ్దాల క్రితం 'జనని' సంస్థను స్థాపించారు. ఆ సంస్థ ద్వారా తెలుగుభాషకు వివిధ రకాల సేవలందిస్తున్నారు. 90వ దశకంలో జనని ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహించే వివిధ రకాల పోటీలంటే ఎనలేని క్రేజ్ ఉండేది. వందలాదిమంది తెలుగు విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యేవారు. స్వయంగా కవి, రచయిత కూడా అయిన చెన్నయ్య.. ఎంతోమంది పుస్తకాలను ముద్రింపజేయడంతో పాటు తన సంస్థ ద్వారా ఆవిష్కరించి, ప్రపంచానికి పరిచయం చేశారు. చెన్నయ్య పూర్వీకుల స్వస్థలం ప్రస్తుత ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలోని గుంటుపల్లి.

సమాచార దర్శిని

అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై అణువిద్యుత్ క్రేంద్రంలో అప్రెంటిస్ షిప్ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. భారత అణువిద్యుత్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కల్పాక్కంలో చెన్నై అణువిద్యుత్ కేంద్రం పనిచేస్తోంది. ఈ కేంద్రంలో ఐటీఐ పూర్తిచేసిన వారికి ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణ ఇవ్వనున్నారు. ఫిట్టర్-29, మెషినిస్ట్-4, వెల్డర్-12, మెకానికల్ డ్రాఫ్ట్స్‌మెన్-1, ఎలక్ట్రీషియన్-25, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-6, ఎలక్ట్రానిక్ మెకానిక్-4, కార్పెంటర్-1, ప్లంబర్-1, మేసన్-1, సివిల్ డ్రాఫ్ట్స్‌మెన్-3, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్-4 తదితరాలు ట్రేడ్ అప్రెంటిస్ శిక్షణ ఇవ్వనున్నారు. ఉపకారవేతనంతో శిక్షణకు ఆసక్తి కలిగిన వారు www.npcil.co.in లో ఏప్రిల్ 30వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి.

తాగునీటి ఫిర్యాదులకు వాట్సాప్ నంబర్లు

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో తాగునీటి సరఫరా, కొరత తదితరాలపై ప్రజలు ఫిర్యాదు చేసేలా వాట్సాప్ నంబర్లు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆ ప్రకారం, జిల్లా సహాయ కేంద్రం నెం.9445346311కు ఫిర్యాదు చేయవచ్చు. అలాగే, పంచాయతీ యూనియన్ల వారీగా ఎల్లాపురం (7708269571), కడంబత్తూర్ (7305921319), గుమ్మిడిపూండి (7548801201), మీంజూరు (7904665459), పల్లిపట్టు (82208034959), పూందమల్లి (7010044876), పూండి (6385348540), పుళల్ (7010559670), ఆర్కే. పేట (7708736007), చోళవరం (7558198922), తిరుత్తణి (7904996062), తిరువాలంగాడు (7550177471), తిరువళ్లూర్ (7550147704), విల్లివాక్కం (7540028312) ఫిర్యాదు చేయవచ్చు.

పళని హుండీ ఆదాయం రూ.5.50 కోట్లు

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయ హుండీల లెక్కింపు ఈ నెల 27, 28 తేదీల్లో జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.5.50 కోట్ల నగదు, 1.547 కిలోల బంగారం, 31.094 కిలోల వెండి, 1207 విదేశీ కరెన్సీ నోట్లను కానుకలుగా సమర్పించారని ఆలయ జాయింట్‌కమిషనర్ మారిముత్తు, ట్రస్టీ బాలసుబ్రమణిలు తెలిపారు.

నేడు ఇండియన్ లెజెండ్స్, బ్రెజిల్ లెజెండ్స్ మధ్య ఫుట్‌బాల్ పోటీ

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలో ఆదివారం ఇండియన్ లెజెండ్స్ - బ్రెజిల్ లెజెండ్స్ మధ్య ఫుట్ బాల్ పోటీ జరగనుంది. ఈ మ్యాచ్ వీక్షించేందుకు స్పాన్సర్స్ టిక్కెట్లు పొందిన అభిమానులు మెట్రో రైళ్లలో ఉచితంగా ప్రయాణించవచ్చు. టిక్కెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మెట్రో రైళ్లలో ఉచితంగా ప్రయాణించవచ్చని నిర్వాహకులు తెలియజేశారు.

ఢిల్లీ వెళ్లిన సెంగోట్టయ్యన్ బీజేపీ నేతలతో భేటీ?

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ మంత్రి సెంగోట్టయ్యన్ ఆకస్మికంగా హస్తినకు వెళ్లడం ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఆయన మదురై నుంచి ఆకస్మికంగా విమానంలో బయలుదేరి ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలో ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను, అమిత్‌షాతో రహస్యంగా భేటీ అయినట్టు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అన్నాడీఎంకే వర్గాలు గానీ, సెంగోట్టయ్యన్ మద్దతుదారులు గానీ దీన్ని ఖండించకపోవడం గమనార్హం.

కానిస్టేబుల్ హత్య కేసు నిందితుడి పరారీయత్నం

● తుపాకీతో కాల్పులు జరిపి నిర్బంధం

చెన్నై,మార్చి29(ఆంధ్రజ్యోతి):మదురై జిల్లా ఉసిలంపట్టి పోలీసుస్టేషన్‌లో జీప్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ ముత్తుకుమార్ (36)పై రాళ్లతో దాడి జరిపి దారుణంగా హతమార్చిన గంజాయి వ్యాపారి పొన్‌వణ్ణన్ ను పోలీసులు కాల్పులు జరిపి అరెస్టు చేశారు. పొన్ వన్నన్ శనివారం ఉదయం తేని జిల్లా కంభం మెట్టు మీదుగా కేరళకు పారిపోయేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం అందటంతో ఉసిలంపట్టి ఎస్ఐ ఆనందన్ సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.పోలీసులను చూడగానే పొన్‌వణ్ణన్ వారిపై మారణాయుధాలతో దాడికి దిగారు. రాళ్లను విసిరాడు. దీంతో ఎస్ఐ ఆనందన్ తుపాకీతో కాల్పులు జరిపి పొన్‌వణ్ణన్‌ను అరెస్టు చేశారు. ఈ సంఘటనలో కానిస్టేబుల్ సుందరపాండి గాయపడ్డారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు...

హత్యకు గురైన కానిస్టేబుల్ ముత్తుకుమార్ అంత్యక్రియలు శనివారం సాయంత్రం పోలీసు లాంఛనలతో జరిగాయి. కళ్లపట్టి శ్మశానంలో శనివారం సాయంత్రం విరుదునగర్ ఎస్పీ కన్నన్ నాయకత్వంలో పోలీసు లాంఛనలతో అంత్యక్రియలు జరిగాయి.

ముస్లింలకు సహాయాల పంపిణీ



వేలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో కాట్పాడిలో ఆలిండియా విలేకరుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం ముస్లింల ఇళ్లకు వెళ్లి సరుకులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు రాజ్‌బాబు మాట్లాడుతూ... ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలను కొనసాగిస్తున్న ముస్లింలకు తమ కమిటీ తరుపున ఈ సహాయాల పంపిణీ చేశామని తెలిపారు.

ఫైర్‌మన్ విక్రమ్ సేవలు అభినందనీయం



వేలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లాలో పలుచోట్ల విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందిన ఫైర్‌మన్ విక్రమ్‌ను శనివారం ఉదయం అగ్నిమాపక శాఖ డైరెక్టర్ ఆబిస్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విక్రమ్ తన సర్వీస్‌లో 25ఏళ్లు కాట్పాడి, రాణిపేట, చెంగల్పట్టు, కాంచీపురం, చెన్నై, వేలూరు తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారని కొనియాడారు. అనంతరం ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేసి అభినందించారు.

స్థలదాతకు నష్టపరిహారం చెల్లించని కేసు

● మదురైలో కలెక్టర్ కారు జప్తు



కోర్టు సిబ్బందితో చర్చలు జరుపుతున్న సబ్‌కలెక్టర్ షాలిని - జిల్లా కలెక్టర్ కారుకు ఇరువైపులా తాళ్లు కడుతున్న కోర్టు సిబ్బంది

టి.నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మదురైలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థకు 50 యేళ్లకు ముందు స్థలం ఇచ్చిన వ్యక్తికి పరిహారం చెల్లించకపోవడంతో కోర్టు ఉత్తర్వుల మేరకు ఆ జిల్లా కలెక్టర్ కారును కోర్టు సిబ్బంది, పిటిషనర్ కలిసి, తాళ్లతో కట్టి జప్తు చేసేందుకు ప్రయత్నించారు. మదురై తత్తనేరి కి చెందిన కరుప్పయ్యా, మీనాక్షి అమ్మాళ్‌కు చెందిన 2.14 ఎకరాలను రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఇళ్లను నిర్మించేందుకు రూ.19,688కు కొనుగోలు చేసింది. అయితే తన స్థలానికి మార్కెట్ రేటు కంటే తక్కువగా ధర నిర్ణయించారంటూ స్థలం యజమాని కరుప్పయ్యా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిపిన కోర్టు సెంట్‌కు రూ.1000 చొప్పున రూ.2.14 లక్షలను కరుప్పయ్యాకు చెల్లించాలంటూ 1982లో ఉత్తర్వులు జారీ చేసింది. దాని ప్రకారం జిల్లా యంత్రాంగం పిటిషనర్‌కు సగం డబ్బులు చెల్లించింది. కరుప్పయ్యా మళ్లీ కోర్టును ఆశ్రయించి 2009లో కలెక్టర్ కారును జప్తు చేసేందుకు ప్రయత్నించారు. జిల్లా అధికారులు బకాయిపడిన సొమ్ములో కొంత భాగాన్ని చెల్లించారు. అదే సమయంలో తీర్పును సవాలు చేస్తూ అప్పీలుకు వెళ్లగా కోర్టు దాన్ని తోసిపుచ్చింది. ఆ తర్వాత కూడా జిల్లా యంత్రాంగం బకాయిలు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో కోర్టు తాజాగా కలెక్టర్ కారును జప్తు చేసుకోమంటూ జనవరి 21న ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలలు దాటినా జిల్లా యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించింది. ఈ పరిస్థితులలో మదురై జిల్లా కలెక్టర్ కారును జప్తు చేసుకునేందుకు కరుప్పయ్యా వారసులు, కోర్టు సిబ్బంది, న్యాయవాది సెల్వరాజ్ తదితరులు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌కు వెళ్లారు. కారును జప్తు చేసుకునేందుకు వచ్చామని తాళాలు ఇవ్వమని కార్యాలయం సిబ్బందిని అడిగారు. సిబ్బంది తాళాలు లేవని చెప్పడంతో తాళ్లతో కట్టి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ హుటాహుటిన అక్కడికి చేరుకుని కరుప్పయ్యా వారసులతో చర్చించారు. పరిహారం బకాయిలను చెల్లిస్తామని హామీ ఇవ్వడం వెనుదిరిగారు.

కుంభకోణం రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



ధ్వజస్తంభంపై పతాకం ఎగురవేస్తున్న ఆలయ పూజారులు

ప్యారీస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తంజావూర్ జిల్లా కుంభకోణంలోని పురాతన రామస్వామి ఆలయంలో రామనవమి ఉత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణ, హనుమంత స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ధ్వజస్తంభం దగ్గర కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, మహాదీపారాధన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల రామనామస్మరణ, మేళతాళాల నడుమ గరుడ పతాకాన్ని ఆలయ పూజారులు ధ్వజస్తంభంపై ఆవిష్కరించి నవమి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో ప్రతిరోజు ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులను ఇంద్ర విమానం, సూర్యప్రభ, చంద్రప్రభ, గరుడ, శేష, హనుమంత, గజ వాహనాల్లో ఊరేగించనున్నారు. ఏప్రిల్ 4వ తేదీ రాత్రి గరుడవాహన సేవ, 7వ తేదీ అర్ధరాత్రి గోరథ ఉత్సవం, 6వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రి 7గంటలకు ఆలయ ప్రాంగణంలో తీర్ధవారి నిర్వహించనున్నారు.

వాల్పారైలో దుకాణాల బంద్



చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా ఆనమలై పులుల అభయారణ్యం సమీప ప్రాంతాలను పర్యావరణ పరిరక్షణ మండలిగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ వాల్పారైలో వ్యాపారులు శనివారం బంద్ పాటించారు. కేంద్ర పర్యావరణ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆనమలై పరిసరాల్లో ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి పర్యావరణ పరిరక్షణ మండలిగా గత యేడాది డిసెంబర్‌లో ప్రకటించింది. దీనిపై ఆక్షేపణ లుంటే రెండు నెలల్లో తెలపాలని పేర్కొంది. ఆ ప్రకటనను వ్యతిరేకిస్తూ గత రెండు నెలలుగా వాల్పారైలోని వాణిజ్య సంస్థలు, కిరాణా దుకాణాలు, టూరిస్టు వాహనాల డ్రైవర్లు ధర్నా, రాస్తారోకో తదితర ఆందోళనలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తేయాకు తోటల కార్మిక సంఘాలు శనివారం ఆందోళనను చేపట్టాయి. ఈ ఆందోళనకు మద్దతుగా వాల్పారైలో వ్యాపారులంతా తమ దుకాణాలను మూసి వేసి సంపూర్ణ బంద్ పాటించారు. ఆటో, వ్యాన్, లారీ డ్రైవర్లు కూడా సమ్మెలో పాల్గొన్నారు.

టాస్మాక్ అవినీతిపై సీబీఐ విచారణ జరపాలి

● టీఎంసీ చీఫ్ జీకే వాసన్




ధర్నాలో పాల్గొన్న జీకే వాసన్, జవహర్‌బాబు తదితరులు

ప్యారీస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ నిర్వహణలో మద్యం విక్రయాలు సాగిస్తున్న టాస్మాక్ సంస్థలో రూ.1000 కోట్ల మేర జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు ఉత్తర్వులు జారీ చేయాలని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ డిమాండ్ చేశారు. స్థానిక హార్బర్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో శనివారం టీఎంసీ ఆధ్వర్యంలో టాస్మాక్ అవినీతిని ఖండిస్తూ జీకే వాసన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పార్టీ ప్రధాన కార్యదర్శుల జవహర్‌బాబు, జీఆర్ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు వీకే అరుణ్‌కుమార్, బిజుచాకో సహా పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వయం సహాయక బృందాలకు రూ.37 వేల కోట్ల రుణాలు

పెరంబూర్, మార్చి29(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక బృందాలకు ఈ ఏడాది రూ.37,000 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో శుక్రవారం యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి, ప్రత్యేక పథకాల అమలు శాఖ పద్దును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తాము అధికారం చేపట్టిన నాలుగేళ్లలో సుమారు 1.35 లక్షల కొత్త సహాయక బృందం ఏర్పాటుచేసి, ఆ బృందాలకు ఏడాదికి రూ.35 వేల కోట్ల బ్యాంక్ రుణాలు అందించామన్నారు. ఆ ప్రకారం, నాలుగేళ్లలో రూ.1.10 లక్షల కోట్ల రుణాలు అందించామని, ఈ ఏడాది రూ.37 వేల కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

రాణిపేటలో రూ.4 కోట్లకు మేకల విక్రయం



వేలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ నేపథ్యంలో శనివారం ఉదయం రాణిపేటలో మేకల విక్రయాలు జోరుగా సాగాయి. మేకల ధరలు వాటి బరువును బట్టి రూ.4వేల నుంచి రూ.22 వేలకు అమ్ముడైనట్లు తెలిపారు. రాణిపేట సంతలో శనివారం ఉదయం 15 కిలోల బరువున్న మేక రూ.8వేల నుంచి రూ.11 వేల ధరలకు విక్రయించారు. ఈ సంతలలో శుక్ర, శనివారాలు రూ.4 కోట్ల మేకలు విక్రయించినట్టు సంత నిర్వాహకులు తెలిపారు.

కుచ్చనూరు శనీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



కుచ్చనూరు శనీశ్వరాలయం వద్ద స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

టి.నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శని పరిహార క్షేత్రంగా పేరుగడించిన కుచ్చనూరు శనీశ్వరాలయం శని పెయర్చి, అమావాస్య సందర్భంగా భక్తులు పోటెత్తారు. పుదుచ్చేరి రాష్ట్రంలోని తిరునల్లారులో ఈ యేడాది శనిపెయర్చి నిర్వహించడం లేదని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. దీంతో తేని జిల్లా కుచ్చనూరులోని శనీశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వేకువజామునే కుచ్చనూరు సురభినదిలో స్నానమాచరించి నువ్వులనూనెతో దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకునారు. ప్రత్యేక పూజలు జరిపారు. దిండుగల్ మలైయడివార (కొండ దిగువనున్న) శనీశ్వర భగవానుడి ఆలయంలోనూ శని పెయర్చి సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు దర్శనానికి బారులు తీరారు.

ఎండల నుంచి భక్తులకు ఉపశమనం



మెట్ల మార్గంపై ఏర్పాటుచేసిన షేడ్ నెట్

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కుండ్రత్తూర్ కొండపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం రాష్ట్రంలో ఉత్తరాభిముఖంగా ఉన్న ఏకైన మురుగన్ ఆలయంగా గుర్తింపు పొందింది. మంగళవారం, కృత్తిక ప్రత్యేక రోజుల్లో వేలాదిమంది భక్తులు సందర్శిస్తుంటారు. ఈ కొండ ఆలయానికి వెళ్లేందుకు దిగువ నుంచి రెండు మార్గాలున్నాయి. అందులో మెట్ల మార్గంలో అధిక సంఖ్యలో భక్తులు వెళుతుంటారు. ప్రస్తుతం ఎండ వేడిమి నుంచి భక్తులు ఉపశమనం పొందేలా మెట్ల మార్గం పైభాగంలో షేడ్ నెట్ ఏర్పాటుచేశారు.

కోదండ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజస్తంభానికి హారతి పూజ

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా రాజపాళయం కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ ధ్వజస్తంభానికి పాలు, పన్నీరు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు రామస్వామి, సీతాదేవి, భూదేవి, హనుమంతుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకల్లో ప్రధానమైన రథోత్సవం ఏప్రిల్ 5వ తేది జరుగుతుందని ఆలయ ట్రస్టీ శ్రీనివాసరాజ తెలిపారు.

నీట్‌కు భయపడి ప్లస్-2 విద్యార్థిని ఆత్మహత్య



దేవదర్శిని (ఫైల్ ఫొటో)

టి.నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు సంస్థలో నీట్‌కు శిక్షణ పొందుతూ వచ్చిన బాలిక ఆ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేననే భయంతో ఉరివేసుకుంది. చెంగల్పట్టు జిల్లా ఊరపాక్కం శాస్త్రిభవన్ ప్రాంతానికి చెందిన సెల్వరాజ్, దేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. సెల్వరాజ్ అయనచేరిలో బేకరీ నడుపుతున్నాడు. ఈ దంపతుల పెద్దకుమార్తె దేవదర్శిని ముగప్పేర్‌లోని ప్రైవేటు పాఠశాలలో 2021లో ప్లస్-2 ఉత్తీర్ణురాలైంది. 2021 నుంచి రెండుసార్లు నీట్ రాసినా తగినన్ని కట్‌ఆఫ్ మార్కులు రాలేదు. ఈ పరిస్థితుల్లో అన్నానగర్‌లోని ప్రైవేటు అకాడమీలో మూడోసారి నీట్‌కు శిక్షణ పొందింది. మూడోసారి కూడా నీట్‌లో మంచి మార్కులు సంపాదించలేననే భయంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన గదిలో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న కిలాంబాక్కం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున దేవదర్శిని మృతదేహాన్ని స్వాధీనం పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'ఉపాధి' నిధులు విడుదల చేయండి : డీఎంకే ధర్నా



ధర్నాలో పాల్గొన్న డీఎంకే ప్రముఖులు

వేలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథక నిధులను విడుదల చేయని కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ వేలూరులో డీఎంకే ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా బీజేపీ నేతలు డీఎంకే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నిస్తున్నారని ధర్నాలో పాల్గొన్న నేతలు వ్యాఖ్యానించారు. ఈ ధర్నాలో డీఎంకే మండల అధ్యక్షుడు బాబు, గజేంద్రన్, గణపతి, నటరాజన్, శంకర్, పార్థసారథి, ప్రకాశ్, కణ్ణన్ సహా డీఎంకే కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్ తదితరులు

వేలూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలో వున్న వండ్రన్‌తంగల్‌లో రాష్ట్రప్రభుత్వం రూ.77.89 లక్షలతో సైన్స్ ల్యాబ్‌ను నిర్మించనుంది. శనివారం ఉదయం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దురైమురుగన్ మాట్లాడుతూ... ప్రజాభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కాట్పాడి మండల అధ్యక్షుడు వేల్‌మురుగన్, ఉపాధ్యక్షుడు శరవణన్, కౌన్సిలర్లు కవిత, సుధా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీయులతో ఢిల్లీ గవర్నర్ నృత్యం



నృత్యం చేస్తున్న గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా నీలగిరి జిల్లాకు వ్యక్తిగత పర్యటనకు వచ్చారు. ఆయన శుక్రవారం ఊటీ షూటింగ్ మట్టం పగల్‌కోడు సంతకు వెళ్లారు. అక్కడ ఆదివాసీయుల ఉత్పత్తుల దుకాణాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఆదివాసీయులతో కలసి గవర్నర్ నృత్యం చేశారు. అనంతరం బైకారా బోట్‌హౌస్‌కు వెళ్లి బోటు షికారు చేశారు. సాయంత్రం ముదుమలై పులుల శరణాలయానికి వచ్చిన గవర్నర్‌ను డిప్యూటీ డైరెక్టర్ విద్య ఆహ్వానించారు. అక్కడి నుంచి అటవీ శాఖ వాహనంలో ముదుమలై అటవీ ప్రాంతంలో సఫారీ ముగించిన అనంతరం తెప్పకాడు ఏనుగుల పునరావాస శిబిరానికి చేరుకున్నారు. అక్కడ పెంపుడు ఏనుగులను తిలకించిన గవర్నర్, వాటికి చెరకు గడలు అందించారు.

విజయ్ రాజకీయం నాలుగు గోడల మధ్యే!

● అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కేపీ మునుస్వామి

ప్యారీస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రాష్ట్రప్రజల మధ్య కాకుండా గత రెండేళ్లుగా నాలుగు గోడల మధ్యే రాజకీయం చేశారని అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కేపీ మునుస్వామి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇటీవల తమ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారని, ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవన్నారు. రాష్ట్ర సంక్షేమం కోసం పలు పథకాలకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని ఈపీఎస్ కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారని వివరించారు. రాష్ట్రంలో 31ఏళ్ళకు పైగా అధికారంలోవున్న అన్నాడీఎంకే అన్ని వర్గాలకు చెందిన ప్రజాలబ్ధినే కాంక్షించిందన్నారు.

వండలూరు జూలో మగ సింహం మృతి



టి.నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వండలూరు అరింజర్ అన్నా జంతు ప్రదర్శన శాలలో 'వీరా' మగ సింహం తీవ్ర అనారోగ్యానికి గురై శుక్రవారం మృతి చెందింది. రాఘవ అనే మగసింహం, కవితా అనే ఆడ సింహానికి 2011లో వీరా జన్మించింది. పుట్టినప్పటి నుండే ఈ సింహం నడుము వద్ద కండరాల లోపంతో బాధపడింది. గత నెల రోజులుగా లేచి నడవలేని స్థితికి చేరింది. జంతు ప్రదర్శన శాల వైద్యులు, వెటర్నరీ విశ్వవిద్యాలయం వైద్య నిపుణులు చికిత్సలందిస్తూ వచ్చారు. శుక్రవారం చికిత్స ఫలించక మృతి చెందింది.

బ్లాక్‌లో ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

25మంది అరెస్ట్

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయించిన 25 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐపీఎల్ పోటీల్లో భాగంగా చేపాక్కం స్టేడియంలో శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విక్రయించారు. టిక్కెట్లు లభించక స్టేడియం వద్ద భారీగా అభిమానులు చేరారు. వీరికి బ్లాక్‌లో టిక్కెట్లను అధిక ధరకు విక్రయించారు. బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయించడాన్ని అడ్డుకొనేలా నగర పోలీస్ కమిషన్ అరుణ్ ఉత్తర్వులతో ఏర్పాటైన ప్రత్యేక బృందం స్టేడియం, పరిసర ప్రాంతాల్లో గస్తీ పనులు చేపట్టి, బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న 25 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి 48 టిక్కెట్లు స్వాధీనం చేసుకుంది.

నీటమునిగి ఐదేళ్ల చిన్నారి సహా ఇద్దరి మృతి

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లిన చిన్నారి, తల్లి నీటమునిగి మృతిచెందారు. తూత్తుకుడి జిల్లా ఒయ్యాంగుడికి చెందిన లారెన్స్ మేట్టుపాళయంలో ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్నాడు. ఆయన భార్య గ్లాడిస్, ఐదేళ్ల కుమార్తె అవిన ఉన్నారు. ఈ క్రమంలో ఒయ్యాంగుడి ప్రాంతంలోని ఆలయ వేడుకలకు లారెన్స్ కుటుంబంతో వెళ్లారు. శనివారం ఉదయం తెన్‌తిరుప్పేరిలోని తామ్రభరణి నదిలో స్నానాలకు వెళ్లారు. అందరూ స్నానాలు చేస్తుండగా, గ్లాడిస్, అవినా లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. చుట్టుపక్కల ఉన్న వారు వారిని రక్షించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆళ్వార్ తిరునగరి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాంబన్ వంతెనకు అబ్దుల్ కలాం పేరు

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాంబన్ వంతెనకు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరు పెట్టాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజ్ఞప్తి చేశారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని కొత్తగా నిర్మించిన పాంబన్ వంతెనను ఏప్రిల్ 6వ తేది ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో, చారిత్రాత్మక గుర్తింపు కలిగిన పాంబన్ వంతెనకు, రామేశ్వరంలో జన్మించి, పెరిగి దేశంలోనే రామనాథపురం జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరు పెట్టాలని ప్రేమలత విజయకాంత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ధనుంజయులు

తిరుత్తణి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టులోని సెయింట్ మేరీస్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో శనివారం ఉదయం పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం ధనుంజయులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. సిస్టర్ ఫ్రాన్సిస్కా, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.తంగమణి, ఉపాధ్యాయులు విశ్వనాథన్, రజిని, కార్తీక్, గుణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచెందూర్‌లో వెనక్కిమళ్లిన సముద్రం



సముద్రం వెనక్కి వెళ్లడంతో బయల్పడిన రాళ్లు

పెరంబూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వెనుక సముద్రం వెనక్కి మళ్లింది. శుక్రవారం కొద్దిమేర మాత్రమే నీరు వెనక్కి మళ్లగా, శనివారం ఆ ప్రభావం మరింత అధికంగా కనిపించింది. సుమారు 100 అడుగులు వెనక్కి వెళ్లడంతో ఆ ప్రాంతంలో పసుపు రంగు పాచితో కూడిన రాళ్లు బయటపడ్డాయి. సునామీ ప్రళయం తరువాత అమావాస్య, పౌర్ణమి రోజుల్లో తిరుచెందూర్ సమీపంలో సముద్రం వెనక్కి వెళ్లడం ఆనవాయితీగా మారింది. అమావాస్య కావడంతో పళని మురుగన్ ఆలయానికి తరలివచ్చిన భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారికి దర్శించుకున్నారు. సముద్రం వెనక్కి వెళ్లడంతో బయల్పడిన రాళ్లపై ప్రమాదస్థితిలో సెల్ఫీలు దిగుతున్న భక్తులను ఆలయ సిబ్బంది, పోలీసులు హెచ్చరించారు.

కోలీవుడ్‌కు మలయాళ నటుల క్యూ!


సింబు

ఇతర భాషల నుంచి వచ్చి కోలీవుడ్‌లో నటించేందుకు వచ్చే నటుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా మలయాళం, తెలుగు, హిందీ, కన్నడ చిత్రపరిశ్రమలకు చెందిన పలువురు నటీనటులు తమిళ చిత్రాల్లో నటించడం ఎక్కువైంది. తెలుగు, హిందీ భాషల నుంచి హీరోయిన్లు అధిక సంఖ్యలో వస్తుంటే, మలయాళం, తెలుగు నుంచి విలన్లు అడుగుపెడుతున్నారు. కానీ, ఇటీవల తమిళ చిత్రాల్లో అన్ని రకాల పాత్రల్లో మలయాళ నటులు అధికంగా కనిపిస్తున్నారు. తాజాగా చియాన్ విక్రమ్ హీరోగా నటించిన 'వీర ధీర శూరన్-2'లో మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కోలీవుడ్ వెండితెరకు పరిచయమయ్యారు. మిమిక్రీ కళాకారుడిగా గుర్తింపు పొందిన సూరజ్.. మాలీవుడ్‌లో ప్రముఖ నటుడు. అలాగే, రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' చిత్రం ద్వారా మరో మలయాళ నటుడు షోఫిన్ షాక్రి కోలీవడుక్కు పరిచయంకానున్నారు. అసిస్టెంట్ దర్శకుడిగా కెరీర్‌ను ప్రారంభించి ఇపుడు మంచి నటుడుగా గుర్తింపుపొందారు. మలయాళ స్టార్ హీరోలు మమ్ముట్టి, మోహన్‌లాల్, దుల్కర్ సల్మాన్ వంటి వారు అపుడప్పుడు తమిళ చిత్రాల్లో నటిస్తున్నారు. ఇపుడు మాలీవుడ్‌కు చెందిన అనేక మంది నటీనటులు పలు చిత్రాల్లో నటిస్తున్నారు.


సూరజ్

కోలీవుడ్‌లో ఇద్దరు పెళ్లికాని ప్రసాద్‌లు!

- నాలుగు పదులు దాటినా పెళ్లి మాటెత్తని హీరోలు

తమిళ చిత్రజ్యోతి

తమిళంలో ఇద్దరు హీరోలు పెళ్లికాని ప్రసాద్‌లుగా ఉన్నారు. వయసు మీదపడుతున్నా పెళ్లి ఊసెత్తడం లేదు. నాలుగు పదుల వయసు దాటినప్పటికీ.. పెళ్లి ప్రస్తావన తేవడం లేదు. ఆ ఇద్దరు హీరోలే విశాల్, సిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు. నిజానికి ఈ ఇద్దరు కోలీవుడ్ హీరోల గురించి గతంలో గాసిప్స్ వచ్చాయి. అయినప్పటికీ వారు ఎక్కడా వాటిపై స్పందిచనూ లేదు. అదే సమయంలో పెళ్లి ప్రస్తావన చేయడం లేదు. ప్రస్తుతం శింబు వయసు 42 కాగా, విశాల్ వయసు 47. వీరిలో విశాల్‌కు గతంలో ఓ యువతితో నిశ్చితార్థం కూడా జరిగింది. కానీ ఇరు కుటుంబాల మధ్యం ఏం జరిగిందో తెలియదుగానీ, రద్దు అయ్యింది. ఇక శింబు విషయానికి వస్తే హీరోయిన్ నయనతారతో పీకల్లోతు ప్రేమలో మునిగినట్టు గుసగుసలు వినిపించాయి. ఆ తర్వాత మనస్పర్థలు రావడంతో విడిపోవడం, నయనతార దర్శకుడు విఘ్నేష్ శివన్‌ను వివాహం చేసుకునింది. కానీ, శింబు మాత్రం ఇంకా మోస్ట్ వాంటెడ్ బ్యాచిలర్‌గానే ఉండిపోయారు. ఈ ఇద్దరు హీరోలు ఎప్పుడు పెళ్లి పీటలెక్కుతారోనని ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. అలాగే, తెలుగులో హీరో ప్రభాస్ కూడా మోస్ట్ వాంటెడ్ బ్యాచిలర్‌గా ఉన్న విషయం తెల్సిందే.


విశాల్

ఏఐతో సృష్టించిన ఇంటిమేట్ వీడియో

- శ్రుతి నారాయణన్



యువ నటి శ్రుతి నారాయణన్‌కు చెందిన ఇంటిమేటెడ్ (అసభ్యకర) వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై ఆమె తాజాగా వివరణ ఇచ్చారు. కృత్రిమమేథ (ఆర్టిఫిషియల్ టెక్నాలజీ)తో తీసిన వీడియో అని ఆమె పేర్కొన్నారు. గత నాలుగైదు రోజులుగా ఆమెకు సంబంధించిన వీడియో ఒకటి ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. అది శ్రుతికి చెందిన రియల్ వీడియోనే అని కొందరు, కాదు ఫేక్ అని మరికొందరు కామెంట్స్ చేశారు. దీనికితోడు ఈ వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్నప్పటికీ శ్రుతి నారాయణన్ మాత్రం పెదవి విప్పలేదు. దీంతో అది నిజమైన వీడియోనే అంటూ చాలా మంది భావించారు. ఈ నేపథ్యంలో ఆమె తన ఇన్‌స్టాలో స్పందించారు. ఏఐ టెక్నాలజీతో ఒక వ్యక్తిని రియల్‌గా ఎలా సృష్టించగలదో ఈ వీడియో తెలియజేస్తుంది. ఆ వీడియోను ఏఐ టెక్నాలజీ సాయంతో రూపొందించారంటూ ఆమె వ్యాఖ్యానించి, ఆ వీడియో తనది కాదని చెప్పకనే చెప్పారు.

'అన్నై ఇల్లం' నా సొంతం

- జప్తు ఉత్తర్వులు రద్దు చేయండి
- కోర్టులో ప్రభు పిటిషన్

దివంగత నటుడు శివాజీ గణేశన్ నివసించిన అన్నై ఇల్లం తనకు సొంతమైనదని, ఈ ఇంట్లో తన కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదని, అందువల్ల ఇంటి జప్తు కోసం జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ శివాజీ గణేశన్ రెండో కుమారుడు, సినీ నటుడు ప్రభు మద్రాస్ హైకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. శివాజీ మనవడు, నటుడు రామ్‌కుమార్ కుమారుడు దుష్యంత్ తన ఈసాన్ ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ తరఫున నిర్మించే చిత్రం కోసం ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ నుంచి రూ.3.74 కోట్ల రుణాన్ని తీసుకున్నారు. ఈ రుణంతో సినిమాను నిర్మించకపోగా, డబ్బును తిరిగి చెల్లించలేదు. ఈ అంశంపై ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ కోర్టును ఆశ్రయించడంతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. ఇందులో అన్ని అంశాలను పరిశీలించిన మద్రాస్ హైకోర్టు అన్నై ఇల్లంను జప్తు చేయాలంటూ ఆదేశించింది. ఈ ఆదేశాలతో షాక్‌కు గురైన శివాజీ గణేశన్ కుమారులు రామ్‌కుమార్, ప్రభు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అన్నై ఇల్లంకు తమకు ఎలాంటి సంబంధం లేదని రామ్‌కుమార్ తెలిపారు. అలాగే, నటుడు ప్రభు తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌లో, 'నా తండ్రి శివాజీ గణేశన్ జీవించివున్నపుడే అన్నై ఇల్లంను నా పేరుతో వీలునామా రాశారు. దీనికి నా సోదరులు, సోదరీమణులంతా సమ్మతం తెలిపారు. ఆ తర్వాత ఇంటిని నా పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నా. అందువల్ల అన్నై ఇల్లంపై పూర్తి హక్కులు నాకే సొంతం. నా అన్న రామ్‌కుమార్, వారి కుమారుడుకు సంబంధించిన రుణం కేసులో నా ఇంటిని జప్తు చేయాలని జారీ చేసిన ఆదేశాలు దిగ్భ్రాంతికి గురిచేశాయి. అందువల్ల నా పేరుతో ఉండే ఇంటిని జప్తు చేయాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతున్నా' అని ప్రభు తన పిటిషన్‌లో పేర్కొన్నారు.


ప్రభు - రామ్‌కుమార్

- 1170 పంచాయతీ యూనియన్లలో

'ఉపాధి' నిధులివ్వని కేంద్ర వైఖరిపై డీఎంకే ధర్నా



డీఎంకే: చెన్నైలో ధర్నా చేస్తున్న మంత్రి సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ తదితరులు - కోవిల్‌పట్టిలో జరిగిన ధర్నాలో పాల్గొన్న మంత్రి గీతాజీవన్, ఎంపీ కనిమొళి తదితరులు

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు చెల్లించాల్సిన రూ.4,034 కోట్లను విడుదల చేయని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ డీఎంకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. రాష్ట్రంలోని 1,170 పంచాయతీ యూనియన్లలో ధర్నాలు, రాస్తారోకో జరిపారు. ఈ పథకానికి సంబంధించి నాలుగన్నర నెలలుగా నిధులు విడుదల చేయని విషయాన్ని డీఎంకే, దాని మిత్రపక్షాలకు చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించినా కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదని సీఎం స్టాలిన్ విమర్శించారు. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న మొండివైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ యూనియన్లలో ఆందోళనలు జరపాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు శనివారం ఉదయం డీఎంకే ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకోలు జరిగాయి. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలో జరిగిన ధర్నాకు పార్టీ ఎంపీ కనిమొళి అధ్యక్షత వహించారు. మంత్రి గీతా జీవన్, తూత్తుకుడి కార్పొరేషన్ మేయర్ జగన్ పెరియసామి, కోవిల్‌పట్టి మునిసిపల్ చైర్మన్ కరుణానిధి తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా చెన్నై సబర్బన్ కుండ్రత్తూరు సమీపం భరణిపుత్తూరు వద్ద జరిగిన ధర్నాలో మంత్రి దామో అన్బరసన్, ఎంపీ టీఆర్‌బాలు, మేడవాక్కంలో జరిగిన ధర్నాలో మంత్రి సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, పోయిచ్చలూరులో జరిగిన ధర్నాలో ఎమ్మెల్యే కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.


కోవిల్‌పట్టి ధర్నాలో పాల్గొన్న డీఎంకే కార్యకర్తలు


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

పోలీసు, అగ్నిమాపక శాఖ భవనాల ప్రారంభం

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై సచివాలయంలో పోలీసు, అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని ఆ రెండు శాఖలకు చెందిన కొత్తగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు. రూ.19.80కోట్లతో నిర్మించిన 96 పోలీసు క్వార్టర్స్, రెండు పోలీసుస్టేషన్లు, అగ్నిమాపక శాఖ కోసం రూ.21.51 కోట్లతో నిర్మించిన 45 సిబ్బంది క్వార్టర్స్, నాలుగు అగ్నిమాపక కేంద్రాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా పోలీసుల కోసం రూ.32.09 కోట్లతో కొనుగోలు చేసిన 500 బైకులు, 300 కార్లు, అగ్నిమాపకశాఖ కోసం రూ.28.45 కోట్లతో కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్ వాహనాలు, 10 జీప్‌లు, 50 బైకులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్. మురుగానందం, ఎక్సైజ్‌శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీ శంకర్ జివాల్, అగ్నిమాపక శాఖ సంచాలకులు అభాష్‌కుమార్, రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ అధ్యక్షులు శైలేష్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

14న నందనంలో కొత్తహాస్టల్ ప్రారంభం..

ఆదిద్రావిడ, గిరిజన విద్యార్థుల కోసం నందనంలో ఎంసీ రాజా హాస్టల్ సమీపంలో రూ.44.50 కోట్లతో 10 అంతస్థులతో నిర్మించిన స్టూడెంట్స్ హాస్టల్‌ను ఏప్రిల్ 14న తమిళ ఉగాది, అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. సచివాలయంలో శనివారం ఉదయం ఆదిద్రావిడ, గిరిజన శాఖ ఆధ్వర్యంలోఉన్నతస్థాయి అవగాహన పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... సమావేశానికి హాజరైన అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నందనం వద్ద ఏప్రిల్ 14న జరగనున్న ఈ హాస్టల్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.


శుక్రవారం చెన్నై వచ్చిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శంకర్

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

- స్నాతకోత్సవంలో శ్రీనివాసరెడ్డి

వాషర్‌మెన్‌పేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేరళ విద్యాలయ హయ్యర్ సెకండరీ పాఠశాలలో నర్సరీ కిడ్స్‌డే, యూకేజీ చిన్నారుల స్నాతకోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ పి.చంద్రశేఖరన్ నాయర్ అధ్యక్షత వహించగా, ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్ సెక్రటరీ ఆదినారాయణరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జేసుతంగం స్వాగతోపన్యాసమిస్తూ... ఈ పాఠశాలలో తెలుగు, మలయాళీ, తమిళ విద్యార్థులు చదువుతున్నారని, అందరికీ సమానంగా విద్యను అందిస్తూ తమ పాఠశాల ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆస్కా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాసరెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ... కష్టపడి చదివితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, బాగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాల నిర్వాహకులకు అభినందించారు. ఆస్కా ట్రస్ట్ తరఫున నగరంలో ఇప్పటివరకు 25కి పైగా పాఠశాలలకు నోట్ పుస్తకాలతో పాటు, స్కాలర్‌షిప్‌లను అందించామని, ఇకపై కేరళ విద్యాలయంకు కూడా ఆస్కా ట్రస్ట్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం అతిథులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. చివరగా, ట్రస్టీ శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్ సెక్రటరీ ఆదినారాయణరెడ్డి యూకేజీ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ ఆర్‌కె.శ్రీధరన్, గోపకుమార్, గోవిందన్, సైనా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణరెడ్డి

రామ్‌రాజ్ కాటన్‌కు కోయంబత్తూరు అంబాసిడర్ ఐకానిక్ అవార్డు

వాషర్‌మెన్‌పేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ- కోయంబత్తూరు 'ది అడ్వర్టైజింగ్ క్లబ్ ఆఫ్ కోయంబత్తూరుతో కలిసి నిర్వహించిన 'బ్రాండ్ కోయంబత్తూరు అంబాసిడర్ అవార్డుల 6వ ఎడిషన్‌లో సంప్రదాయ భారతీయ దుస్తుల్లో అగ్రగామి అయిన రామ్‌రాజ్ కాటన్ ఐకానిక్ బ్రాండ్‌తో సత్కరించారు. శనివారం కోవైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రామ్‌రాజ్ కాటన్ చైర్మన్ కేఆర్ నాగరాజన్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీవీఎస్ సప్లయ్ చైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ చైర్మన్ ఆర్.దినేష్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగరాజన్ మాట్లాడుతూ.. ఈ గుర్తింపు ప్రత్యేకమైనదని, ఎందుకంటే ఇది ధోతీని కేవలం ఒక సంప్రదాయంగా కాకుండా, ఒక శైలిగా మార్చే ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.


కేఆర్ నాగరాజన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న దినేష్ తదితరులు

మేమే ప్రధాన ప్రతిపక్షం

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి


కొబ్బరినీళ్లు అందిస్తున్న ఈపీఎస్

ప్యారీస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీఎంకేకు ప్రధాన ప్రత్యర్థి తామేనంటూ తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ చేసిన వ్యాఖ్యలకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తామేనని స్పష్టం చేశారు. సేలం జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఓమలూరు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈపీఎస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ, పుచ్చకాయలు తదితరాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే, ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే మధ్యే పోటీ ఉంటుందని, ఈ వ్యహారంలో టీవీకే అధ్యక్షుడు విజయ్, ఆ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపేలా మాట్లాడారన్నారు. ప్రజాస్వామ్యంలో పార్టీల నేతలు వారి అభిప్రాయాలు తెలియజేస్తుంటారని, అందులోని వాస్తవాలను ప్రజలే అర్థం చేసుకుంటారన్నారు. చివరగా ఆయన ఆదివారం ఉగాది పండుగ జరుపుకోనున్న తెలుగు, కన్నడ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర రాజకీయాల్లో మాదే అగ్రస్థానం

రెండవ స్థానం కోసమే పోటీ

సీఎం వ్యంగ్యాస్త్రాలు

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో రెండో స్థానం కోసం గట్టి పోటీ ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్థానిక పెరంబూర్‌లో శనివారం సాయంత్రం జరిగిన రంజాన్ వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధి ప్రాతిపదికగా ఆర్థిక నివేదిక సమర్పించామన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ముస్లింలకు అండగా డీఎంకే ఉంటుందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో రెండవ స్థానం కోసం గట్టి పోటీ నెలకొందని, డీఎంకే మొదటి స్థానంలో ఉందన్నారు. ఎడప్పాడి కార్లు మారిమారి పోవడాన్ని శాసనసభ రికార్డుల నుంచి తొలగించాలని అన్నాడీఎంకే కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

తెలుగు, కన్నడ ప్రజలకు సీఎం స్టాలిన్ ఉగాది శుభాకాంక్షలు

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తెలుగు, కన్నడ ప్రజలందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉగాది శుభకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భాషాపరమైన మైనార్టీలను ఎల్లప్పుడూ ఆదరించి, వారితో సోదరభావంతో డీఎంకే ప్రభుత్వం మెలుగుతుందని తెలిపారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో ఉగాదికి సెలవు ప్రకటిస్తే అన్నాడీఎంకే ప్రభుత్వం ఆ ఉగాది సెలవును రద్దు చేసిందని, 2006లో డీఎంకే మళ్లీ అధికారంలోకి రాగానే ఉగాది రోజును మళ్లీ ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ద్రావిడ భాషలు మాట్లాడే దక్షిణాది రాష్ట్రాలన్నీ ప్రస్తుతం నియోజకవర్గాల పునర్విభజన అమలు చేస్తే తమ ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే విషయాన్ని దేశమంతటా వ్యాపింపజేసేలా ఈనెల 22 దక్షిణాది రాష్ట్రాలకు చెందినవారంతా సమైక్యతను ఎలుగెత్తి చాటిన విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. అలాగే మాతృభాష గొప్పదనాన్ని పిల్లలకు బోధించాలని పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలపై అన్యభాషల దాడిని సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. షడ్రుచుల పచ్చడి, మామిడాకుల తోరణాలు, రంగవల్లులతో ఉత్సాహంగా ఉగాది వేడుకలు జరుపుకునే తెలుగు, కన్నడ ప్రజలందరికీ సీఎం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

భక్తి ముందు ఎండ ఓడిపోయింది!





ఎండ భగభగా మండుతోంది. చెమటలు కారిపోతున్నాయి. అప్పుడే దర్శనం చేసుకుని బయటకు వచ్చారు బెంగళూరుకు చెందిన ఒక కుటుంబం. వీల్‌ఛైర్‌కే పరిమితమైన తల్లి. కూడదీసుకుంటూ నడుస్తున్న తండ్రి. ఇద్దరినీ గుడి ఎదురుగా జర్మన్ షెడ్ నీడలో ఉంచి, ఆ కొడుకూ కోడలూ లడ్డూల కోసం వెళ్లారు. తదేకంగా గోపురాన్నే చూస్తున్న ఆమె, భర్తను ఒక కోరిక కోరింది. 'మళ్లీ తిరిగి వస్తామో.. లేదో.. ఇంకొక్కసారి ఆ సామికి దణ్ణం పెట్టుకోవాలని ఉందయ్యా' అని. అతను తలెత్తి ఒక్క క్షణం నిప్పులు కురుస్తున్న ఆకాశంకేసి చూశాడు. ఆ వెంటనే, 'పద వెళ్దాం' అన్నాడు. వీల్ ఛైర్‌ను తీసుకుంటూ గోపురం వైపు కదిలాడు. పైన ఎండ.. పాదాలు మాడిపోతున్నాయి. అలిసిపోతూ, ఆగుతూ.. మునివేళ్ల మీద నడుస్తూ వీల్‌ఛైర్‌ను గొల్ల మండపం దగ్గరకు తీసుకువెళ్లాడు. అక్కడ గుడికి అభిముఖంగా ఇద్దరూ నేల మీద సాష్టంగపడి దణ్ణం పెట్టుకున్నారు. తడి కళ్లతో ఆమె భర్తను చూసింది. అతను సంతృప్తిగా నవ్వాడు. 90లకు దగ్గరవుతున్న వయసు వారిది. 58 ఏళ్ల దాంపత్య బంధం బలం అది. వారి భక్తి ముందు సూర్యుడు కూడా తల వంచాడు కదా అని ఆ వృద్ధ జంటను చూసిన వారు అనుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





మోషేన్‌రాజు - తరుణ్‌భాస్కర్, ఈషా రెబ్బా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, సినీ దర్శకుడు తరుణ్‌భాస్కర్, హీరోయిన్ ఈషా రెబ్బా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,569

తలనీలాలు సమర్పించినవారు: 21,780



జిల్లాకు ఉగాది పురస్కారాల పంట

రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య, కళా రంగ ప్రముఖులకు శనివారం ప్రకటించిన కళారత్న (హంస), ఉగాది పురస్కారాలు జిల్లాలో 11 మందిని వరించాయి. ఆదివారం విజయవాడలో నిర్వహించే ఉగాది కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వీరు పురస్కారాలను అందుకోబోతున్నారు. కళా రత్న పురస్కార గ్రహీతలకు రూ.50 వేల నగదుతోపాటూ హంస ప్రతిమ అందజేస్తారు. ఉగాది పురస్కార గ్రహీతలకు రూ.10వేల నగదు, సర్టిఫికెట్‌తో సత్కరిస్తారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

ఆముదాల మురళి



తవణంపల్లె మండలం అత్తిమాకులపల్లెలో 1975లో పుట్టారు. కర్ణాటకలోని ముక్త విశ్వవిద్యాలయం నుంచీ సంస్కృతంలో పీజీ పూర్తి చేశారు. 200 అష్టావధానాలు, 3 శతావధానాలు చేశారు. అవధాన కళానిధి, అవధాన శేఖర, అవధాన రత్నాకర బిరుదులు పొందారు. సుమారు 15 పుస్తకాలు రాశారు.

డాక్టర్ వీఆర్ రాసాని



ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు అధ్యాపకుడిగా పదవీ విరమణ పొందారు. కథ, నవల, నాటక రచయితగా ప్రసిద్ధులు. 1957లో పులిచెర్ల మండలం కురవపల్లెలో పుట్టారు. మెరవణి, పయనం, మావూరి కథలు, మహాన్నుభావుడు మా నామాల సాయిబు వంటి కథా సంపుటాలు ప్రచురించారు. చీకటిరాజ్యం, పరస, స్వప్నజీవి, ఆదియోధుడు, ఏడోగ్రహం, వలస, ముద్ర, చీకటిముడులు, బతుకాట నవలలు రాశారు.

కంపల్లె రవిచంద్రన్



టీటీడీ సప్తగిరి మాసపత్రిలో ఉపసంపాదకుడిగా పనిచేస్తున్నారు. సినిమా రంగానికి సంబంధించి అనేక పుస్తకాలు రాశారు. కాశీఖండానికి సరళవచనం, మహాభారతోపన్యాసాలు (వ్యాససంపుటి), అంతా రామమయం సహృదయ రవిచంద్రిక, తిరుప్పావై - తిరువెంబావై వ్యాఖ్య, శ్రీకృష్ణశ్మరణం మమ, వల్లభాచార్య రచన సుమధురకు వ్యాఖ్య, వంగిపూడి పద్య కావ్యానికి గో కలాపం పేరుతో వ్యాఖ్య, సంకుసాల నృశింహ కవి కవికర్ణరయానయానికి వ్యాఖ్య రాశారు.

డాక్టర్ ఎస్.ఉషారాణి

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో కూచిపూడి అధ్యాపకురాలిగా ఉన్నారు. యక్షగానంపై ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 2004లో పరిశోధన చేశారు. దూరదర్శన్ ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా ఉన్నారు. ఎస్వీబీసీ ఛానల్‌లో అనేక కార్యక్రమాలకు కొరియోగ్రఫీ చేశారు. భగవద్గీత - నృత్య రీతి పుస్తకాన్ని రాశారు.



ద్వారం లక్ష్మి



ద్వారం లక్ష్మి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ సంగీత, నృత్య విభాగంలో అధ్యాపకులుగా ఉన్నారు. కర్ణాటక, లలిత సంగీత, హిందూస్థానా భజన్స్ గానం చేయడంలో మేటి. పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు మనుమరాలు ఈమె. సంగీత విద్యను పద్మవిభూషణ్ ఎంఎల్ వసంతకుమారి, పెమ్మరాజు సూర్యారావు వద్ద నేర్చుకున్నారు. దేశ, విదేశాల్లో నాలుగు వేలకు పైగా సంగీత కచేరీలు చేశారు.

కిరణ్‌క్రాంత్ చౌదరి



కిరణ్‌క్రాంత్ చౌదరి శిల్ప కళపై డీ.లిట్ డిగ్రీ పూర్తి చేశారు. ఎస్వీయూ ఆర్కియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఫ్యాకల్టీ డీన్‌గా, యూజీసీ ఎమిరటస్ ప్రొఫెసర్‌గా చేశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో కళా సంబంధమైన అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఇప్పటి వరకూ 18 పుస్తకాలు రాశారు. 9 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 120 వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

సాధుల మునిరత్నం



సంగీత కుటుంబ నేపథ్యం నుంచీ వచ్చారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో సంగీత రంగంలో డిప్లొమో చేశారు. 1993లో టీటీడీలో చేరి 30 ఏళ్లకు పైగా నాదస్వర విద్వాంసులుగా పనిచేశారు. నేషనల్ ఏ-గ్రేడ్ కళాకారులుగా గుర్తింపు పొందారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా సృష్టించారు.

ప్రతిభకు పట్టం.. ఉగాది పురస్కారాలు



ఆకుల మల్లేశ్వరరావు: ఐబీఎస్ (ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్)లో స్టేషన్ డైరెక్టర్ (ఏఐఆర్)లో పనిచేశారు. హిందీలో ఎంఏ, సంస్కృత ఆంగ్ల యోగాలో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. హిందీ, తెలుగులో ఏడు పుస్తకాలను రచించారు.



ముని మల్లికార్జున: కర్ణాటిక్ మ్యూజిక్ డోలులో సర్టిఫికెట్ కోర్సు శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ డోలు పూర్తి చేసి శ్రీకాళహస్తి ఆలయంలో భజంత్రిగా ఉన్నారు. ఆలిండియా రేడియో బి గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు.



శ్రీవాణి ఎల్లా: టీటీడీ ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో వీణ విభాగాధిపతి. ఆలిండియా రేడియో ఏ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు.



టి.పురుషోత్తమ నాయుడు.: ఎస్వీబీసీలో ఆధ్యాత్మిక విశేషాల విభాగంలో సీనియర్ ఏవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆలయాలపై వెయ్యికి పైగా కథనాలు రూపొందించి ప్రసారం చేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎంసీజే (జర్నలిజం)చేశారు. పీహెచ్‌డీని సైతం పూర్తి చేశారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

నేటి నుంచి రెండు ప్యాసింజర్ రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

తిరుపతి(సెంట్రల్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-కదిరి దేవరపల్లి, తిరుపతి-గుంతకల్ మధ్య గతంలో రాకపోకలు సాగిస్తున్న రెండు ప్యాసింజర్ రైళ్లను ఆదివారం నుంచి యథావిధిగా పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పాకాల, పీలేరు, ధర్మవరం, అనంతపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

అమ్మను కొట్టాడని..అన్నను చంపాడు

- కాపులూరులో ఘటన



వెంకటరమణయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాజీ

నాయుడుపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అమ్మను కొట్టాడన్న కోపంతో తమ్ముడు అన్న ప్రాణం తీసిన ఘటన నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సరోజనమ్మకు వెంకటరమణయ్య(50), బాబు కుమారులు. వెంకటరమణయ్య గ్రామంలోనే గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాబు గూడూరులో కాపురముంటూ రోజూ గ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుని వెళుతుంటాడు. శుక్రవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన వెంకటరమణయ్య భార్య మణెమ్మను కొడుతుండగా తల్లి సరోజనమ్మ అడ్డు వచ్చింది. దీంతో తల్లిని కూడా కొట్టాడు. అదే సమయంలో అక్కడున్న బాబు 'అమ్మను ఎందుకు కోడతావ్' అని నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆవేశానికి గురైన వెంకటరమణయ్య మచ్చుకత్తితో బాబుపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. కత్తిని లాక్కున్న బాబు అన్న మెడపై వేటువేశాడు. వెంకటరమణయ్య అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. శనిగ్రహం కుంభరాశి నుంచి మీన రాశిలోకి ప్రవేశించడంతోపాటు ఉత్తరాబాద్ర నక్షత్రంతో కూడిన శనివారం, అమావాస్య కావడంతో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

గుట్టు వీడని విద్యార్థిని స్నేహ కేసు..!

తిరుపతి(నేరవిభాగం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని స్నేహ కేసు గుట్టు వీడడంలేదు. ఈ విద్యార్థిని రెండవ అంతస్తు నుంచి కింద పడింది. ఈ ఘటనలో అమ్మాయి తలకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు పేర్కొంటున్నారు. మిద్దెపై నుంచి ఆమే పడి వుంటే కచ్చితంగా తలకు బలమైన గాయాలు అయ్యేవని డాక్టర్లు అంటున్నారు. సహచర విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ కారణంగానే స్నేహను కొట్టి కింద పడేసి ఉంటారనే అందువల్లే కాళ్లకు, పొట్టభాగంలో ఘాయాలయ్యాయని అనుమనాలు ఉన్నాయి. పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడంలో ఆలస్యమవుతోందని పోలీసులు చెబు తున్నారు. పాఠశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న స్నేహ చిన్నాన్నతో పాటు సిబ్బందిని, సహచర విద్యార్థులను, చికిత్స పొందుతున్న స్నేహను ఎస్ఐ గిరిబాబు విచారించి స్టేట్‌మెంటు రికార్డు చేశారు. అయితే ఆ వివరాలు బయటకు పొక్కడంలేదు. అయితే బాధ్యులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామని ఈస్ట్ పోలీసులు అంటున్నారు.

సాహిత్య, కళాస్రష్టలకు శ్రీవాణి ఉగాది పురస్కారాలు



శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి నుంచి పురస్కారాలు అందుకుంటున్న నరాల రామారెడ్డి, ఎస్వీ.రామారావు, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, రాణీ నాగశ్రీ శైలేశ్వరి, ప్రాస మణి

శ్రీసిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరచిన ప్రముఖులకు శ్రీసిటీలోని ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఐదుగురికి ఉగాది పురస్కారాలు అందజేశారు. తెలుగు సాహిత్యం, అవధాన కళలలో డాక్టర్ నరాల రామారెడ్డి (ప్రొద్దుటూరు) సేవలను ప్రశంసిస్తూ ఆయనను సత్కరించారు. ఆలయ పునర్నిర్మాణం, చారిత్రక పరిశోధనల్లో విశేష కృషి చేసిన శిల్పకళా, పురావస్తు పరిశోధకులు, చరిత్రకారుడు స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరించారు. తెలుగు సినిమా వికాసానికి ఎస్వీ రామారావు చేసిన సేవలను అభినందిస్తూ శ్రీవాణి పురస్కారాన్ని అందజేశారు. ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, రేడియో 'ఏ గ్రేడ్' కళాకారిణిగా గుర్తింపు కలిగిన పద్మావతి మహిళా యూనివర్శిటీ సంగీత శాఖాధ్యక్షురాలు డాక్టర్ రాణీ నాగశ్రీ శైలేశ్వరి శాస్త్రీయ సంగీత సంప్రదాయానికి చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు అందుకున్నారు. హాస్యభరిత, లయబద్ధ ప్రసంగాల దిట్ట, ప్రాసమణిగా పేరుగాంచిన అన్నదాత సుబ్రమణ్యేశ్వరరావు తన ప్రాస ప్రసంగంతో సభికులను ఆకట్టుకున్నారు. పురస్కార గ్రహీతల ప్రతిభా పాటవాలను రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలలో శ్రీవాణి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను కోట రాజశేఖర్, ఆర్ఎం భాస్కర్, డాక్టర్ కే జగ్గారావు, డీ.ఝాన్సీ, భైరి పార్థసారథి పరిచయం చేశారు. వ్యాఖ్యాతగా పల్లేటి బాలాజీ వ్యవహరించారు.

కాటేసిన కునుకు

- డివైడర్‌ను ఢీకొన్న కారు
- ఒకరి మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు



కావడి శ్రీనివాసరెడ్డి (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వారు నలుగురు మంచి స్నేహితులు. ఏటా ఉగాది రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అదే ప్రకారం హైదరాబాద్ నుంచి కారులో తిరుమలకు పయనమయ్యారు. మార్గమధ్యంలో కునుకుపాటు వారిని కాటేసింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా.. ముగ్గురు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటన శనివారం ఉదయం తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్ పంచాయతీకి చెందిన కావడి శ్రీనివాసులురెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. అదే పంచాయతీకి చెందిన మల్లారెడ్డి(55) పోస్టుమ్యాన్‌గా, భరత్‌కుమార్(45), బాల్‌రెడ్డి(45)లు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఈ నలుగురు శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి తిరుమలకు కారులో బయలుదేరారు. శనివారం ఉదయం కారు అదుపు తప్పడంతో బసవయ్యపాళెం వద్ద జాతీయ రహదారి ప్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న శ్రీనివాసులరెడ్డి వాహనంలోనే ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ముగ్గురు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసులరెడ్డి మృతదేహాన్ని వెలుపలకు తీసి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



తీవ్రంగా గాయపడిన బాలిరెడ్డి - ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తెలుగుజాతి గర్వించదగ్గ పార్టీ తెలుగుదేశం

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో నరసింహయాదవ్, శాప్ ఛైర్మన్



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతి(జీవకోన), మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగ్గ ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ పార్లమెంటు అధ్యక్షులు, యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహయాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. టీడీపీ ఆవిర్భావ వేడుకలను నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద పెద్దఎత్తున నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎన్నో పథకాలను ప్రవేవపెట్టిన మహనీయుడని కొనియాడారు. నందమూరి తారక రామారావు ఆశయాలను చంద్రబాబు, నారా లోకేశ్ కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు పులిగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, ప్రణీత్, మహేష్‌యాదవ్, కుమారమ్మ, వెంకటరత్నం, సింగంశెట్టి సుబ్బరామయ్య, సుబ్బుయాదవ్, బీజీ కృష్ణయాదవ్, హేమంత్ రాయల్, గోళ్ల మధుసూదన్‌నాయుడు, సుధాకర్, అంబూరు సింధూజ, నరేష్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ధోని లోకయాదవ్, వెంకటాద్రియాదవ్, బాల, అయ్యప్ప, దొరైరాజు, శ్రీనివాస్‌యాదవ్, అక్కినపల్లి లక్ష్మయ్య, చందు చౌదరి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు భేష్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు భేష్‌గా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఉపాధిహామీ పథకం 2024-25 అమలుతో జిల్లాలో సాధించిన ప్రగతి, ప్రణాళికలపై కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది జిల్లాలో రూ.1.72లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించామన్నారు. ఈ పథకంలో అన్ని రకాల పనులకు గాను కూలీలకు రూ.260కోట్లు వేతనాల రూపంలో చెల్లించామన్నారు. 4,853 చెరువుల్లో పూడికతీత, పునరుద్ధరణ పనులుచేపట్టి 450కోట్ల లీటర్ల నీటిని భూమిలోకి ఇంకింపజేశామన్నారు. సన్నకారు, చిన్నకారు రైతుల పొలాల్లో 1,064 పంటకుంటలు, 803 పొలాల్లో కందకాలు, 1,920 కిలోమీటర్ల పంటకాలువ పూడికతీత పనులు జరిగాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం, 1,211 ఎకరాల పండ్లతోటల పెంపకం చేపట్టినట్లు వివరించారు. రూ.20కోట్లతో చిన్నకారు రైతుల పశువులకు షెడ్లు నిర్మించామన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తారు, మెటల్ రోడ్లు వేశామన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నకిలీ పట్టాల బాగోతంపై చర్యలు తీసుకోండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం-

రేణిగుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇంటి పట్టాలను నకిలీ చేసి విక్రయించిన అప్పటి రెవెన్యూ అధికారి, ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన బుజ్జమ్మ 2022లో రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోవడంతో బాధితురాలు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు అప్పటి రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఈ నెల 7వ తేదీన ఆదేశాలు జారీ చేయగా, శనివారం వాట్సాప్ గ్రూపులో హైకోర్టు ప్రొసీడింగ్స్, పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ హల్‌చల్ చేశాయి.

సీబీఎస్‌లో ఉగాది రద్దీ



తిరుపతి(ఆర్టీసీ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదినాల సెలవులతో పాటు వారాంతం కలసిరావడంతో ఒక్కసారిగా సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గ్రామాలకు వెళ్లేవారు, అక్కడి నుంచి నగరానికి వచ్చేవారితో అన్ని ప్లాట్‌ఫామ్స్ కళకళలాడాయి. ముఖ్యంగా పల్లెవెలుగు బస్టాండులో మరింత ఎక్కువ రద్దీ కనిపించింది. ఏడుకొండల బస్టాండు శ్రీవారి భక్తులతో కిటకిటలాడింది. రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో నిరీక్షణ తప్పలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీట్ల కోసం పాట్లు పడ్డారు. ఆర్టీసీ వారు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి ఉంటే బావుండేదని ప్రయాణికులు చర్చించుకోవడం వినిపించింది.

